# ఈద్ ముబారక్..!

రంజాన్ మాసంలో ముస్లిం భక్తులు పాటించే ఉపవాస వ్రతం అత్యంత కఠోరమైనది. తెల్లవారుఝామున నాలుగున్నర గంటలనుంచి సూర్యాస్తమయం వరకు దాదాపు పద్నాలుగు గంటలపాటు ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. ఏమీ తినకుండా, ఏమీ తాగకుండా, కనీసం మంచినీళ్లయినా తీసుకోకుండా కామం, క్రోధం లాంటి ఏలాంటి వికారాలను అంటకుండా జీవించాలనేదే అభిమతంతో ముందుకు సాగుతారు. వెదును వేయడం, కనీసం వినడం, పలకడం కూడా చేయరు. ఒక ఉపవాసి ఈ నియమాలన్నీ ఖచ్చితంగా పాటిస్తారు. ఈ ఉపవాసం ఎంతో కఠినమైనది అనిపించినా మంచినీళ్లకోసం గొంతెండిపోతున్నా ఒక్క చుక్క నీరైనా తాగరు. ఇలాంటి నియమాలమధ్య ఉపవాసం సాగించడం ఈ మాసం ప్రత్యేకత. రంజాన్ అనేది ఎనలేని శుభాలను చేకూర్చుతుంది. ఈ మాసంలో ప్రతి ఘడియ ఎంతో అమూల్యమైనది రమ్జాన్లో పుణ్యఫలాల స్థానాన్ని, దాని ప్రతిఫలాన్ని తానే నిర్ణయిస్తానని దేవుడు వాగ్దానం చేస్తాడని వీరి నమ్మకం. ఈ మాసంలోని చివరి పది రోజుల్లో ఉపవాసం చేస్తున్నవారు చేయవలసిన అతిముఖ్యమైన ఆరాధన ఒకటుంది. ఖుర్ఆను గ్రంథం దివినుండి భువిపైకి ఈ మాసంలోనే అవతరించినప్పటికీ అవతరించిన అల్లాహ్ గోప్యంగా ఉంచాడు. ఆ రాత్రి రమ్జాన్ మాసం చివరి పదిరోజుల్లో బేసి సంఖ్యల్లో ఉంటుందని ఆ రాత్రి వెయ్యిమాసాలకంటే కూడా విలువైనదని, భక్తుడు ఘనమైన ఈ రాత్రిని పొందడానికి అయిదురాత్రులు జాగారం చేసి ఆరాధనలో గడిపి దాన్ని పట్టుకోవాలని ఆదేశించాడు. కనుక పవిత్రమైన ఆ రాత్రిని వెదకడానికి ఇరవైరోజుల ఉపవాసాలను పాటించి అలసిపోయినప్పటికీ ఈ భక్తులు ఆ అయిదురోజుల జాగారం చేసి ఆరాధనలు చేస్తారు. అప్పుడే వారు అనుకున్న అల్లా సాన్నిహిత్యాన్ని పొందుతారు. క్షమాభిక్ష పెట్టమని నరక జ్వాలల నుంచి తనను కాపాడమని ప్రభువును వేడుకుంటారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే. కానీ సిరిసంపదల విషయంలో మాత్రం ఒక్కొక్కరిని ఒక్కోవిధంగా పంచిపెట్టాడు. చేతికి ఉన్న అయిదువేళ్ల మాదిరిగానే ఆకారంలోనూ, సంపదలోనూ, ఆలోచనా విధానంలోనూ రూపకల్పన చేసాడంటారు. దేవుడు అలా చేసి మానవులందరినీ ఇట్టే వదిలేయలేదు. ధనవంతుల సంపదలో పేదవాళ్ళు, వితంతువులు, అనాథలు, బాటసారులు, ఆగత్యపరుల హక్కును కూడా ఇట్టే పెట్టాడని చెబుతారు. దీని కోసం జకాతు దానాన్ని విశ్వాసులందరిపై విధి ధర్మంగా చేసాడు. వారి మొత్తం సంపదలోంచి ప్రతి సంవత్సరం లెక్కచూసి రెండున్నర శాతం చొప్పున నిరుపేదలకు పంచిపెట్టాల్సి ఉంది. ఇలా ఈ మాసం మాత్రమే చేయాలా అంటే కాదు. నిత్యం ఇలా అలవాటు చేసుకోవాలని ముందుగా ఈ నెలరోజులు బలవంతంగా చేస్తారు. కానీ వారిలో ఎందరిలో ఈ అలవాటు జీవితపు బాటగా మారుతుందో అనేది ఆలోచించాల్సిందే. దేవుని సన్నిధిలో ఉన్నంతవరకు మనకు ఏదీ అక్కర్లేదు. అంతా ఆయనే చూసుకుంటాడనే ఆలోచన ఉంటే చాలు అందరిలోనూ పరివర్తన వస్తుంది..!

నేటి నిజం
మంగళవారం 26-5-2020

# కరోనాకు తోడు మండుటెండలు

హైదరాబాద్, మే 25:ప్రచండ భానుడి ప్రతాపానికి దేశం అల్లాడుతోంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండుతున్నాయి. కరోనా భయానికితోడు ఎండలు కూడా బయటకు వెళ్లనీయడం లేదు. లాక్డౌన్ సడలిం పులతో బయటకు రావాలనుకుంటున్న ప్రజలను భానుడు అడ్డగిస్తున్నాడు. ఏ చిన్నపనికి వెళదామన్నా కాలు బయటపెట్టనీయడం లేదు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు వేడిమి,ఉక్కపోత నానాయాతన పెడుతున్నాయి. అంఫాన్ తుఫాన్ కారణంగా కనీస తేమ కూడా లేకుండా పోయింది. దీనికితోడు దేశంలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్య తీవ్రం అయ్యింది. దేశం ఎడారిగా మారుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదేమో. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడి ఉండకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను పెంచడం లేదు. తెలుగు రాష్ట్రాలు ఎండ వేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వడగాడ్పులు ఇందుకు తోడ్పడుతున్నాయి. రోహిణి కార్తెలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం అవుతోంది. నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఇంతటి ఉష్ణోగ్రత నమోదవుతుందని వాతావరణ శాస్త్రజ్ఞులు వెల్లడిస్తున్నారు. ఉష్ణోగ్రతకు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. రాబోయే నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని కొన్ని ప్రాంతాల్లో 50 డిగ్రీలకు రుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కోస్తాలో సాధారణ డిగ్రీలకు అటుఇటుగా నమోదవుతున్నా గత రెండురోజుల నుంచి వేడి గాలులు పెరిగాయి. సాధారణంగా మండే ఎండలు అంటేనే మే నెల గుర్తుకు వస్తుంది. అటువంటిది మండే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. లాక్డౌన్ కారణంగా అనేకులు ఇళ్లకే పరిమితం కావడంతో వడదెబ్బ మృతుల సంఖ్య పెద్దగా నమోదు కావడం లేదు. తెలంగగా, రాయలసమీ, కోస్తాంధ్ర జిల్లాలు ఉదయం ఏడుగంటలకే భగభగమంటున్నాయి. హైదరాబాద్లో పదిదాటితే నమోదయిందంటే బైటకు నడవలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వచ్చే వారంపాటు 45-50 డిగ్రీలు ఖచ్చితంగా ఉంటుందని, అంతేకాకుండా వడగాడ్పులు కూడా ఉండే ప్రమాదం లేకపోలేదని వాతావరణశాఖ అప్రమత్తం చేస్తోంది. మరో పక్క రుతుపవనాలు ప్రవేశిస్తే తప్ప రెండు రాష్ట్రాల్లో చల్లబడే పరిస్థితి కనిపించడం లేదు. జూన్ 5నాటికి కేరళకు రుతుపవనాలు రాగలవని భావిస్తున్నారు. ఎండలు ఇలాగే మండిస్తే వయోవృద్ధులకు సంక్లిష్టపరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. ఉదయం 10గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లవద్దని హెచ్చరికలు చేస్తోంది. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ దుస్తితి నుంచి దూరం కావాలంటే పర్యావరణ హితమైన చర్యలకు ఇప్పటి నుంచే పూనుకోవాలి. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. అనంత మొదలుకుని ఆదిలాబాద్ వరకు మంచినీటి సమస్య లేని జిల్లా లేదంటే అతిశయోక్తి కాదు. ఇకపోతే తెలంగాణ రాజధాని హైదరాబాద్లో బోర్లు ఎండిపోయాయి. తాగునీరు కాదుకదా రోజువారీ నీటికి కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. భూగర్భజలాలు అడుగంటడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే నగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో నీటివసతిలేక ఇళ్లు సైతం ఖాళీచేసి జనం తరలిపోతున్నారు. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాల పరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలనేవి ఏనాటినుంచో లేవనే చెప్పాలి. వీటికితోడు జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తంచేసి వడదెబ్బసోకకుండా జాగ్రతలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సీమజిల్లాల్లో ఉష్ణోగ్రత 41 నుంచి 47 డిగ్రీల వరకూ ఉంది. సీమలో మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న వడగాడ్పులు సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని కొన్ని ప్రాంతాల్లో 50డిగ్రీలకు చేరుకునే ప్రమాదం ఉన్నట్లు చెబుతున్నారు. కోస్తాలో సాధారణ డిగ్రీలకు అటుఇటుగా నమోదవుతున్నా గత రెండురోజుల నుంచి వేడిగాలులు పెరిగాయి. మరో పక్క రుతుపవనాలు ప్రవేశిస్తే తప్ప రెండు రాష్ట్రాల్లోన్రు భూగర్భజలాలు పెరిగే అవకాశం లేదు. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లవద్దని హెచ్చరికలు చేస్తోంది. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ దుస్తితి నుంచి దూరం కావాలంటే పర్యావరణ హితమైన చర్యలకు ఇప్పటి నుంచే పూనుకోవాలి. కరోనా అనుభవాలతో రానున్న రోజుల్లో ప్రజలు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలి. లేకుంటే భవిష్యత్ మరింత దుర్భరం కానుంది.

# నియంత్రిత వ్యవసాయంలో ఇక రైతులదే బాధ్యత

### సర్కార్కూ ఓ ఛాన్స్ ఇచ్చి చూడాలి
### ఈ యేడు పంటలు పండించాక పరిస్థితిని అంచనా వేయాలి

హైదరాబాద్,మే25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో చేపడుతున్న వ్యవసాయాభివృద్ధి పనులకు సంబంధించి రైతులు కూడా చిత్తశుద్ధిగా వ్యవహరించాల్సి ఉంది.ఈ యేడు ప్రభుత్వం సూచించిన విధంగా పంటలు వేసి లాభహనష్టాలను అంచానా వేసుకోవాలి. అలాగే తమ పొలాల్లో ఎలాంటి పంటలు పండుతాయో, ఎంత ఖర్చువుతుందో నిర్ధారించుకునే అవకావం వస్తుంది. కేవంల వరితోనే గాకుండా ఇతరత్రా వంటలతో ప్రయోజనం ఉందా లేదా అన్నది కూడా అంచనా వేసుకునే సమయం ఆసన్నమైంది. తెలంగాణలో ఇప్పటికే అనేక ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయి. రైతులను ఆదుకునేందుకు అనేక విధాలుగా ప్రభుత్వం ముందుకు వస్తోంది. గతంలో ఎప్పుడూ ఎక్కడా ఇలాంటి పకాలు అమలుకాలేదు. రైతులకు నిరంతర విద్యుత్, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఇప్పుడు పెట్టుబడి పథకం వస్తోంది. ఈ డబ్బులను కేవలం వ్యవసాయ పెట్టుబడి కోసమే వినియోగిస్తే ప్రభుత్వ లక్ష్యం సిద్దిస్తుంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ముందుకు సాగాలి. వచ్చిన డబ్బులను దుబారా చేస్తే మాత్రం ఇక ఎవరు కూడా వారిని ఆదుకోలేరు. అంతా ప్రభుత్వమే చేస్తున్నప్పుడు కష్టపడి వ్యవసాయాన్ని పరుగుల పెట్టించాలి. బంగారు పంటలు పండించాలి. కెసిఆర్ ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి. నిజానికి ఇప్పటికే అనేక సబ్సిడీలను ఇస్తున్నారు. తాజాగా ఉపాధిని కూడా జోడించాలని సిఎం కెసిఆర్ కేంద్రంతో పోరాడుతున్నారు. కూలీల కొరతను అధిగమించి, సాగు పనుల్లో వేగం పెంచేందుకు తెలంగాణ సర్కారు, వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. నియంత్రిత పంటలతో రైతులను ప్రోత్సహిస్తోంది. ఎక్కడ ఏ పంట వేయాలో చెబుతోంది. ఇందుకోసం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాకు కోటి రూపాయలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా సాగుకు ఉపకరించే చిన్నచిన్న పరికరాలతోపాటు ట్రాక్టర్లను సైతం సబ్సిడీపై అందజేస్తున్నది వ్యవసాయరంగాన్ని ఆధునీకరించి, యంత్ర సాగును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా అన్నదాతలకు సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరాలు అందిస్తోంది. గత ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అంతగా పట్టించుకోలేదు. రైతులకు రావాల్సిన సబ్సిడీలు నామమాత్రమే. ఆధునిక యంత్రాల సబ్సిడీ కూడా ఇచ్చిన దాఖలులేవు. తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనులు చేసుకునేందుకు వీలుగా భారీ యంత్రాలతోపాటు రైతులకు అవసరమయ్యే చిన్నచిన్న పరికరాలను సరఫరా చేస్తున్నది. కూలీల కొరతను అధిగమించి, తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసుకునేందుకు ఈ యంత్రాలు ఉపయోగ పడనున్నాయి. దళారీ వ్యవస్థ చెక్ పెట్టేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆన్లైన్లోనే స్వీకరిస్తున్నది. రాయితీపై సరఫరా చేస్తున్నా క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేక కొద్ది మందికే అవి అందుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా నియంత్రిత పంటలను పండించి అంతరపంటలతో లాభం ఆర్జించాలి. యంత్రాల వినియోగంతో పేద రైతులకు పెంచిన రాయితీతో ప్రయోజనం చేకూరనుంది. బిందు, సేద్య పరికరాల్లోనే వంద శాతం రాయితీ ఉండేది. వ్యవసాయ యంత్రాలను గతంలో ఒకరిద్దరు రైతులు మాత్రమే ఉపయోగించు కునేవారు. గతంలో ట్రాక్టర్లు, రోటోవేటర్లు, కేజ్వీల్స్, నాటువేసే యంత్రాలు, నాగళ్లు, మక్కలు ఒలిచే యంత్రాలు, స్ప్రేయర్లు, ప్లవ్లు, కల్టివేటర్లు, తదితరాలను గ్రామంలో కొంతమంది బడా రైతులే పొందేవారు. అవకాశాలన్ని అర్హులైన రైతులందరు వినియోగించుకొని లబ్దిపొందాలి. ఉచిత విద్యుత్ ఇప్పటికే సాకారం అయ్యింది. ఎరువులు అందుబాటుల ఉంటున్నాయి. విత్తనాలను నాణ్యమైనవే గుర్తించి అందచేస్తున్నారు. ఇకపోతే చెరువుల పునరుద్దరణ కూడా వేగంగా సాగుతోంది. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పూర్తియితే ఇక నీటి కొరత అన్నది రాదు. తెలంగాణ మరో కోస్తా కావాలన్న ఆకాంక్ష నెరవేరనుంది. తాజాగా ఇస్తున్న రైతుబంధు సాయంతో పెట్టుబడికి వెంపర్లాడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఏ ప్రభుత్వం కూడా ఇంతకు మించి సాయం చేస్తుందంటే నమ్మలేం. కానీ తెలంగాణలో మాత్రమే ఇదంతా కళ్లకు కనిపించేలా జరుగుతోంది. ఈ అవకాశాలను కూడా అందిపుచ్చుకుని నాణ్యమైన పంటలను పండించడం ద్వారా రైతులు తమ బాధ్యత నిర్వహించాల్సి ఉంది.

# చండప్రచండంగా భానుడి ప్రతాపం

### రానున్న రెండు రోజులు మరింత తీవ్రం
### వడగాలులు కూడా విపరీతంగా ఉంటాయని హెచ్చరిక

న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ): వచ్చే రెండు రోజులు భానుడు ప్రతాపం చూపనున్నాడని, ఉత్తరాది రాష్ట్రాలు జాగ్రత్తగా ఉండాలని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. రానున్న రెండురోజుల్లో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకావం ఉందని ప్రకటించింది. వడగాలుల తీవ్రత పెరుగుతోంది. ఎండల తీవ్రత కారణంగా ప్రజలు బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. నైతురుతి రుతు పవనాలు వచ్చే వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని తెలిపారు. దేశ రాజధానిలోని చాలా ప్రాంతాల్లో వడగాడ్పులు, గంటకు 20 కి.మీ.

వేగంతో ధూళితో కూడిన గాలులు వీస్తాయని వెల్లడించింది. ఢిల్లీలో ఆదివారం అత్యధికంగా 44.4 డిగ్రీలు నమోదయిందని, కనిష్ట ఉష్ణోగ్రత 28.7 డిగ్రీలుగా ఉందని ప్రాంతీయ వాతావరణ అధికారి కుల్దీప్ శ్రీవాత్సవ తెలిపారు. క్రమంగా ఇది 47 డిగ్రీలకు చేరుకుంటుందన్నారు. ఢిల్లీలో ఈ నెల 29-30 తేదీల్లో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వడగాడ్పులు వీస్తాయన్నారు. అందువల్ల ఉత్తర భారతదేశంలోని హర్యానా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్పై ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ప్రజలు నీడపట్టునే ఉండాలని, బయట తిరగొద్దని ఆయన సూచించారు.

తెలంగాణలోని రామగుండం, ఆంధ్రప్రదేశ్ లోని రెంటచింతల ప్రాంతాల్లో ఇప్పటికే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా అవి మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీవ్ర వడగాల్పుల తీవ్రత అధికం కావడంతో రాగల నాలుగైదు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జగిత్యాలలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రత, పెద్దపల్లిలో 47.0, మంచిర్యాల 46.9, నల్లగొండలో 46.8, పెద్దపల్లిలో 46.7, భద్రాద్రి కొత్తగూడెంలో 46.5, జయశంకర్ భూపాలపల్లి 46.4, నిర్మల్ 46.4, మహబూబ్నగర్ 46.1, కామారెడ్డి 45.9, హైదరాబాద్ 44.8, మేడ్చల్ మల్కాజిగిరి 44.8, సంగారెడ్డి 44, రంగారెడ్డి 43.7, ఆదిలాబాద్ 46.3, భద్రాచలం 43.2, హన్మకొండ 44.5, ఖమ్మం 44.6, మెదక్ 44.2, నిజామాబాద్ 44.9, రామగుండం 45, కుమురంభీం ఆసిఫాబాద్45.5, సూర్యాపేట 44.6, ములుగు 44.5, నారాయణపేట 44.5, బేగంపేట ఎయిర్పోర్టు పరిసరాల్లో 42.8, రాజేంద్రనగర్లో 42.5, హయత్నగర్లో 41.8, హకీంపేటలో 42.8, ఇక్రిశాట్ పటాన్చెరులో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. శనివారం ఉష్ణోగ్రతలతో పోల్చితే ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్నగర్ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 26వ తేదీన ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్నగర్ జిల్లాలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఛత్తీస్గఢ్ నుంచి ఇంటీరియర్ తమిళనాడు వరకు తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని, ఛత్తీస్గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో 1.5 కి.మీ. నుంచి 3.1 కి.మీ. ఎత్తు మధ్య ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఉత్తరాది నుంచి వీస్తున్న వడగాడ్పులతో వివిధ జిల్లాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# మాస్కులు ధరించకుంటే జరిమానా తప్పదు

లక్నో,మే25(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్లో కోవిడ్- 19 నిబంధనలలో మరో నిబంధనను కొత్తగా జతచేర్చారు. దీని ప్రకారం మాస్కు వేసుకోకుండా బయట తిరిగితే పోలీసులు రూ.100 నుంచి రూ .500 వరకు జరిమానా వసూలు చేస్తారు. ఇంతేకాకుండా ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తికి రూ. 250 నుంచి వెయ్యి వరకూ జరిమానా వసూలు చేస్తారు. ఉత్తరప్రదేశ్లో మాస్కులు ధరించని 5,300 మందికి చలానాలు విధించారు. అలాగే ద్విచక్ర వాహనాలపై వెనుక కూర్చున్న 200 మందిపై చర్యలు తీసుకున్నారు. అదనపు ప్రధాన కార్యదర్శి (హోం అండ్ ఇన్ఫర్మేషన్) అవనీష్ కుమార్ అవస్థీ మాట్లాడుతూ మాస్కులు ధరించనందుకు 5,298 మందికి చలాన్ విధించామని తెలిపారు. గరిష్టంగా 1461 చలాన్లు రాజధాని లక్నోలో విధించామని, 1306 చలాన్లు వారణాసిలో విధించామని చెప్పారు.

# మహారాష్ట్రలో ఆగని కరోనా దాడి

### కేరళ వైద్యబృందం సాయం కోరిన ప్రభుత్వం

ముంబై,మే25(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతుండటంతో నిపుణులైన వైద్యులు, నర్సులను పంపించాలని మహారాష్ట్ర ప్రభుత్వం కేరళ సర్కారును కోరింది. రాష్ట్రంలో కరోనాపై పోరుకు 50 మంది డాక్టర్లు, 100 మంది నర్సులను పంపించాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కేరళ ప్రభుత్వానికి ఆదివారం లేఖ రాసింది. అయితే కరోనా వైరస్ నియంత్రణలో మహారాష్ట్రకు సహాయం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, వైద్యులను పంపిస్తామని కేరళ ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీనికి సంబంధించి తమకు ఒక లేఖ రాయాలని కోరింది. దీంతో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఈ మేరకు లేఖ రాసింది. మహారాష్ట్రలో కరోనా కేసుల సంఖ్య 50,231కి చేరింది. రాష్ట్రంలో ఆదివారం కొత్తగా 3041 కేసులు నమోదవగా, 58 మంది మరణించారు. దీంతో మహారాష్ట్రలో మొత్తం మరణాల సంఖ్య 1635కి పెరిగింది. భారత్లో సరైన సమయంలో లాక్ డౌన్ అమలు చేయడంతో కరోనా వైరస్ వ్యాప్తిని సమర్థంగా కట్టడి చేయగలిగామని సెంట్రల్ కరోనా టాస్క్ ఫోర్స్ ఎంపవర్డ్ గ్రూప్ -1 చైర్మన్ వీకే పాల్ అన్నారు. లాక్డౌన్ కారణంగా కేసుల సంఖ్య తగ్గడంతో పాటు మరణాలను చాలా వరకు నియంత్రించగలిగామన్నారు.

# కొల్లి నాగేశ్వరావు మృతి తీరని లోటు

### -నివాళి అర్పించిన లక్ష్మణ రెడ్డి

విజయవాడ,మే25(ఆర్ఎన్ఎ): అఖిల భారత కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు మృతి తీరని లోటని ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. మాచవరంలోని కొల్లి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై నాగేశ్వరరావు చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. జలవనరులపై అపార అనుభవం కలిగిన ఆయన చివరి నిముషం వరకు రైతు సంక్షేమానికి కృషిచేశారని కొనియాడారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలుత కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లి నాగేశ్వరరావు కుమార్తె, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి, భార్య టానియా, అల్లుడు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కొల్లి నాగేశ్వరరావుకు ఉన్న అనుబంధం, ఆయన రాసిన పుస్తకాలను లక్ష్మణరెడ్డికి వివరించారు. ఆయన వెంట చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.వీరారెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులున్నారు.

# సోనూసూద్ మరో మంచి పని

### రూ.2లకే తయారయ్యేలా మాస్క్ పై దృష్టి

ముంబై,మే25(ఆర్ఎన్ఎ): రీల్ లైఫ్లో విలన్ అయినా రియల్ లైఫ్లో హీరో అనిపించుకుంటున్నాడు సోనూసూద్. లాక్డౌన్లో చిక్కుకుపోయిన వలస కార్మికులను వారి గ్రామాలకు తరలించేందుకు విశ్వప్రయత్నం చేశాడు. అందుకు సోనూసూద్పై స్మృతి ఇరానీ ప్రసంశల వర్షం కురిపించింది. అలాగే పేద ప్రజలకు తన హోటల్లో వసతి కల్పిస్తూ ప్రతిరోజూ ఆహార బాధ్యతలు కూడా చేపడుతున్నాడు. ఈ మంచి పనులే కాకుండా ఇప్పుడు ప్రజలు కరోనా బారిన పడకుండా ఉండేందుకు తనదైన శైలిలో ఫేస్మాస్క్ తయారు చేసి చూపిస్తున్నాడు. 2 రూపాయల ఫ్లాస్టిక్ ఫైల్ తీసుకొని దాన్ని రెండింటిగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత స్టాప్లర్ తీసుకొని ఒక కవర్కి అటు చివర ఒక రంధ్రం, ఇటువైపు మరొక రంధ్రం వేయాలి. ఇప్పుడు సన్గ్లాస్ తీసుకొని రెండు రంధ్రాల్లో సెట్చేసి కళ్లకు పెట్టుకుంటే సరి. ముఖమంతా కవర్ అయ్యేలా మాస్క్ రెడీ! మాస్క్ తయారీ విధానాన్ని వీడియో తీసి సోషల్మీడియాలో షేర్ చేశాడు సోనూ. సోనూసూద్ చేస్తున్న మంచి పనులకు అభిమానులు ఫిదా అవుతున్నారు.

# బోసిపోనున్న టిడిపి మహానాడు

### -జూమ్ యాప్ ద్వారా ఆన్లైన్లో నిర్వహణ

అమరావతి,మే25(ఆర్ఎన్ఎ): దివంతగ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్బంగా ఏటా నిర్వహించే మహానాడు ఈ యేడు బోసిపోనుంది. కేవలం ఆన్లైన్కే పరిమితం కానుంది. ఈమేరకు పార్టీ అధిష్టానం కార్యక్రమాన్ని ఖరారు చేసింది. ఈ నెల 27, 28న టీడీపీ మహానాడును నిర్వహించాలని అధిష్టానం నిర్ణయించింది. కరోనా కారణంగా ఈ సారి ఆన్లైన్లో టీడీపీ మహానాడును నిర్వహించనున్నారు. జూమ్ యాప్ ద్వారా 14 వేల మంది పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సంస్థాగత అంశాలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలు, ప్రత్యేక హోదా, విభజన చట్టం అంశాలపై మహానాడులో చర్చించనున్నారు. ఈ మేరకు కార్యకర్తలు పేర్లు నమోదు చేసుకునేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

# ఎమర్జెన్సీ ఎత్తివేసిన జపాన్..

హైదరాబాద్, మే 25: దేశవ్యాప్తంగా విధించిన ఎమర్జెన్సీని జపాన్ ప్రధాని షింజో అబే ఎత్తేశారు. ఇవాళ జాతిని ఉద్దేశించి ఆయన టీవీలో ప్రసంగించారు. చాలా కట్టుదిట్టమైన ప్రణాళికతో ఎమర్జెన్సీ ఆంక్షలను సడలిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో రాజధాని టోక్యోలో నిబంధనలు సులభతరం కానున్నాయి. ఏప్రిల్ 7వ తేదీన ఇచ్చిన ఆదేశాలతో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కోవిడ్ నియంత్రణ కోసం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అయితే మే నెల రెండవ వారం నుంచి స్వల్పంగా ఆంక్షలను జపాన్ సడలిస్తున్నది. జపాన్లో ఇప్పటి వరకు 16550 వైరస్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, 820 మంది మరణించారు.

# ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత మెండు

### జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

ఆదిలాబాద్,మే25(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగమంటున్నాడు. రోహిణి కార్తెలో రోళ్ళుపగిలేలా ఎండలు మండుతాయన్న నానుడి నిజం చేస్తూ ఎండలు మండుతున్నాయి. రోహిణికి ముందే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. జిల్లాలో శుక్రవారం రోహిణి కార్తీ ప్రారంభం రోజే ఒక్కసారిగా

ఉష్ణోగ్రత నమోదైంది. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. మరో వారం రోజులపాటు ఎండల తీవ్రత ఉంటుందని అంటున్నారు. మునుముందు మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా జైనద్లో 46.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అదేవిధంగా మంచిర్యాల, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లోనూ 46 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత రికార్డయింది. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి, ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. అసలే కరోనా వైరస్ ప్రభావంతో ఇళ్ల వద్దే ఉంటున్న ప్రజలు ఎండ తీవ్రతతో మరింతగా ఉంటి నుంచి బయటకురాని పరిస్థితి. జిల్లాలో వేసవి కాలం ఆరంభం నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా, కరోనా లాక్డౌన్తో ప్రజలు బయటకు రాలేకపోయారు. దీంతో పెద్దగ ఆప్రభావం కనిపించలేదు. కానీ మధ్యలో వర్షాలు కురవడంతో కాస్తా తగ్గినా భానుడి ప్రతాపం మళ్లీ ఉగ్రరూపం దాల్చుతోంది. 45 నుంచి 47 డిగ్రీల వరకు నమోదైంది. ఎండలకు వడగాల్పులు తోడయ్యాయి. దీంతో ఇళ్ల నుంచి జనం బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో ఉదయం 10గంటలు దాటితేనే రోడ్లన్నీ నిర్మానుశ్యంగా మారుతున్నాయి. రోహిణికార్తి మొదలు కావడంతో వాతావరణంలో భారీ ఎత్తున మార్పులు వచ్చే అవకాశం ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళలోనే పనులు ముగించు కోవాలని, మధ్యాహ్నం అయినంత వరకు విశ్రాంతి తీసుకోవడం మేలని సలహాలు ఇస్తున్నారు. ఎండలో తిరుగుతూ పనులు ముగించుకుని ఇంటికి చేరుకోగానే సుమారుగా ఐదు నిమిషాలు విశ్రాంతి తీసుకుని నీటిని తాగాలి. రోజుకు కనీసం ఐదు లీటర్ల శుద్ధమైన నీటిని తాగాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలను సేవించాలని సూచిస్తున్నా రు . ముఖ్యంగా పండ్ల రసాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, వడదెబ్బ తగి లితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వై ద్యు ల సూచనలు పాటించాలని పేర్కొంటున్నారు.ఎండ తీవ్రత మరో పది రోజులు ఇలాగే కొనసాగితే వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, చిన్నారులు వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# ప్రైవేటు హాస్పిటల్లకు వార్నింగ్ ఇచ్చిన కేజ్రీవాల్




హైదరాబాద్, మే 25: ఢిల్లీలోని ప్రైవేటు హాస్పిటల్లలో 20 శాతం బెడ్లను కోవిడ్19 రోగులకు రిజర్వ్ చేయాలని ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ ఆదేశించారు. ప్రైవేటు హాస్పిటల్లు కరోనా పేషెంట్లను వెనక్కి పంపించరాదు అని వార్నింగ్ ఇచ్చారు. మొత్తం 117 హాస్పిటల్లు ఈ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కోవిడ్ చికిత్స కోసం నేటి నుంచి రెండు వేల బెడ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. కరోనా పేషెంట్కు చికిత్స అందించేందుకు నిరాకరించిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం ఆధీనంలో 4వేల బెడ్లు ఉన్నాయని, ప్రస్తుతానికి 1500 బెడ్స్ మాత్రమే నిండి ఉన్నట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు.

# హాకీ దిగ్గజం బల్బీర్ సింగ్ కన్నుమూత

పాటియాలా,మే25(ఆర్ఎన్ఎ): భారత హాకీ దిగ్గజం బల్బీర్సింగ్ (95) కన్నుమూశారు. మెదడు సంబంధిత వ్యాధితో మే 8 నుంచి చికిత్స పొందుతున్న బల్బీర్ సింగ్ తుదిశ్వాస విడిచారు. బల్బీర్ సింగ్ సోమవారం ఉదయం 6.30 గంటలకు తుదిశ్వాస విడిచారని మొహాలీలోని పోర్టిస్ ఆస్పత్రి డైరెక్టర్ అభిజిత్ సింగ్ వెల్లడించారు. 1948, 1952, 1956 ఒలింపిక్స్లో బల్బీర్ సింగ్ భారత హాకీ టీంకు మూడు స్వర్ణపతకాలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. అంతేకాకుండా 1975 వరల్డ్ కప్ విన్నర్ భారత హాకీ టీంకు చీఫ్ కోచ్, మేనేజర్ గా వ్యవహరించారు. ఒలింపిక్స్ పురుషుల హాకీ ÷నైల్ లో అత్యధిక గోల్స్ చేసిన వ్యక్తిగా బల్బీర్ సింగ్ రికార్డు సృష్టించారు. బల్బీర్ సింగ్ కు కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు.

# ఇంటికే పరిమితం అయిన రంజాన్ ప్రార్థనలు

### సందడి లేకుండా సంయమనం పాటించిన ముస్లిం సోదరులు

న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ): కరోనావ్యాప్తి నేపథ్యంలో కేంద్రప్రభుత్వం విజ్ఞప్తి మేరకు దేశవ్యాప్తంగా ముస్లింలు ఇంటివద్దనే రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఇంటి దగ్గర ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఢిల్లీలోని తన నివాసంలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. లాక్ డౌన్ 4.0 కొనసాగుతున్న నేపథ్యంలో చెన్నైలోని ట్రిప్లికానే ఏరియాలో వాలాజా మసీదును మూసివేశారు. ఢిల్లీలోని చాందినీ చౌక్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. కర్ణాటకలోని హుగ్లీతోపాటు ఇతర ప్రాంతాల్లో లాక్ డౌన్ నిబంధనలు పాటిస్తూ రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. హైదరాబాద్లో కూడా అంతా ఇంటికే పరిమితం అయ్యారు. ఇంటివద్దనే ప్రార్థనలు జరుపుకుని ఆదర్శంగా నిలిచారు. దీంతో ఎక్కడా సందడి కానరాలేదు. ఇదిలావుంటే దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ ప్రజల్లో సోదరభావాన్ని పెంపొందిస్తుందని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. దేశపౌరులు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రధాని కోరుకున్నారు. రంజాన్ ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సమృద్ధిని కలుగజేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కరుణ, సేవాతత్పరత, సుహృద్భావానికి రంజాన్ పండుగ ప్రతీక రంజాన్ అని అన్నారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సామాజిక దూరం పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

# నియంత్రిత పంటలతోనే లాభాలు మెండు

## –కెసిఆర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి: జీవన్ రెడ్డి

నిజామాబాద్,మే25(ఆర్ఎన్ఎ): తెలంగాణ సర్కార్ వ్యవసాయానికి అధిక ప్రాధ్యాన్యమిస్తూ సాగులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని ఆర్మూర్ ఎమ్మె÷–యలే జీవన్ రెడ్డి అన్నారు. చెప్పిన పంటలు వేసి లాభాలు పొందాలన్నారు. ఈ మేరకు రైతులు వానాకాలం పంటల నుంచే సన్నద్దం కావాలన్నారు. సోమవారం నాడిక్కడ మాట్లాడుతూ తొలుత నియంత్రిత పద్ధతిలో పంటలు సాగుచేయాలని సూచించారు. రైతు సోదరులు ప్రభుత్వం సూచించిన పంటలనే సాగుచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. గడిచిన ఆరేళ్లలో వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిందని పేర్కొన్నారు. రైతులకు 24గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ అన్నదాతల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. పండించిన ప్రతిగింజను కొనుగోలు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. రైతు పండించిన పంటను తాము నిర్ణయించిన ధరకు అమ్ముకునే విధంగా రైతుబంధు సమితులను ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకున్నామంటే అది కేసీఆర్ పరిపాలనా దక్షతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రైతులే క్లస్టర్ పరిధిలో సమావేశాలను ఏర్పాటు చేసుకొని ఏ పంటలు వేయాలి, సాగులో సమస్యలు, పంటల ధర నిర్ణయించుకోవడం వంటివి జరగాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతుబంధు వేదికలను నిర్మించడం జరుగుతుందన్నారు. రైతులందరూ సంఘటితమై పండించిన పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే స్థాయికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో తీసుకువచ్చిన నియంత్రిత పంటలను సాగు చేసే విధానంలో జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని రైతాంగాన్ని కోరారుమొక్కజొన్న కేవలం యాసంగిలోనే వేయాలని, వానకాలంలో అసలు మక్కలు పండించొద్దన్నారు. కంది పంటను ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు.

# చెర్నోబిల్ కన్నా కరోనా దారుణం

## ప్రపంచ ఆరోగ్య సంస్థను తప్పుదోవ పట్టించిన డ్రాగన్

## చైనాపై మరోమారు దుమ్మెత్తి పోసిన అమెరికా

వాషింగ్టన్,మే25(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారిగా మారడానికి కారణమైన చైనాపై అమెరికా విమర్శల పర్వం కొనసాగిస్తోంది. సోవియట్‌లో జరిగిన చెర్నోబిల్ అణుప్రమాదంతో కరోనావైరస్‌ను పోలుస్తూ చైనాపై విమర్శలు గుప్పించింది. కరోనా వైరస్ విజృంభణ సమయంలో డ్రాగన్ వ్యవహార శైలి, చెర్నోబిల్ దుర్ఘటన సమయంలో సోవియట్ తీరులాగే కనిపిస్తోందని తాజాగా అమెరికా జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ ఓబ్రియన్ విమర్శించారు. వైరస్‌తో ఏం జరుగుతుందన్న విషయం చైనాకు ముందే తెలిసినప్పటికీ ప్రపంచ ఆరోగ్యసంస్థను తప్పుదోవ పట్టించిందన్నారు. వైరస్ సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా చైనా అడ్డుపడిందని విలేకరుల సమావేశంలో ఓబ్రియన్ ఆరోపించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నాశనానికి కారణమైన ఈ వైరస్‌ను ప్రపంచం మీదకు చైనా వదిలిపెట్టిందని దుయ్యబట్టారు. చెర్నోబిల్ దుర్ఘటనలాగే ఈ వైరస్ వ్యాప్తిని దాచిపెట్టిన తీరు చరిత్రలో ఉండిపోతుందని అన్నారు. మరో 10 లేదా 15 సంవత్సరాల తర్వాత హెచ్‌బీఓ ఛానెల్‌లో ప్రత్యేక కార్యక్రమంగా దీన్ని చూస్తామని రాబర్ట్

ఓబ్రియన్ అభిప్రాయపడ్డారు. చెర్నోబిల్ ఘటన సమయంలో అక్కడ జరుగుతున్న పరిణామాలను ప్రపంచానికి చెప్పడంలో నాటి సోవియట్ యూనియన్ ఆలస్యం చేసినందునే అది ఘోర ప్రమాదంగా మారిందని అన్నారు. ప్రస్తుతం చైనా వ్యవహరించిన శైలి కూడా అదేవిధంగా ఉందని విమర్శించారు. వైరస్ విజృంభణ సమయంలో వాస్తవ సమాచారాన్ని బయటి ప్రపంచానికి తెలియనీయకుండా చైనా దాచిపెట్టిందన్నారు. ఈ చర్యతో ఎన్నో లక్షల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఓబ్రియన్ దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే, వరుసగా అమెరికా చేస్తున్న ఆరోపణలను తాజాగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఖండించారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉన్న చెర్నోబిల్ అణువిద్యుత్ కేంద్రంలో 1986లో జరిగిన ఘటన మానవ చరిత్రలో ఒక అత్యంత దుర్ఘటనగా నిలిచిపోయింది.

# 3 నెలల తర్వాత తల్లి చెంతకు ఐదేండ్ల బాలుడు.. ఒంటరిగా విమానంలో




బెంగళూరు,మే25: లాక్‌డౌన్ కారణంగా గత రెండు నెలల నుంచి నిలిచిపోయినా దేశీయ విమానాల రాకపోకలు ఇవాళ తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో దేశంలోని వేర్వేరు నగరాల్లో ఉండిపోయిన చాలా మంది ఇప్పుడు అయినవాళ్ల దగ్గరికి వెళ్లేందుకు అవకాశం లభించింది. అలా ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ కుటుంబసభ్యులను కలుసుకునేందుకు ఈ రోజు విమాన ప్రయాణం చేసిన వారిలో విహాన్ శర్మ అనే ఐదేండ్ల బాలుడు కూడా ఉన్నాడు. విహాన్ శర్మ లాక్‌డౌన్‌కు నెల రోజుల మందే ఢిల్లీలో ఉన్న తన అమ్మమ్మ, తాతయ్యల దగ్గరికి వెళ్లాడు. అయితే, ఆ తర్వాత కరోనా మహమ్మారి విస్తరించడంతో లాక్‌డౌన్ మార్చి 24 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది. దీంతో విహాన్ మూడు నెలలుగా అక్కడే చిక్కుకుపోయాడు. తన తల్లితండ్రి మాత్రం కర్ణాటకలో ఉండిపోయారు. అయితే సోమవారం డొమెస్టిక్ ఫ్లైట్‌లు ప్రారంభం కావడంతో ఆ బాలుడిని ఒంటరిగా తల్లిదండ్రుల చెంతకు పంపించారు. స్పెషల్ క్యాటగిరీ ప్రయాణికుడిగా ఢిల్లీ నుంచి వచ్చిన ఆ బాలుడిని అతని తల్లి కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రిసీవ్ చేసుకున్నది.

# కరోనా కట్టడికి ఆరు సూత్రాలు అమలు..

హైదరాబాద్,మే 25 : కరోనా కట్టడికి నగర పోలీసులు ఆరు సూత్రాలను అమలు చేస్తున్నారు. లాక్‌డౌన్‌తో బిజీగా ఉంటూ.. మరో పక్క తమ రోజు వారి విధులపై దృష్టిపెట్టిన పోలీసులు కరోనా దరిచేరకుండా ఉండేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో తప్పని సరిగా కొన్ని నియమ నిబంధనలు పాటించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కరోనాతో నగరానికి చెందిన ఓ కానిస్టేబుల్ మృత్యువాత పడటం, మరికొందరికి పాజిటివ్ కూడా రావడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటూ విధులు నిర్వహించాలని పోలీసులు ఉన్నతాధికారులు సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కరోనాను ఎదుర్కోవడం కోసం పోలీస్‌స్టేషన్లలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చేవారికి..!

ప్రతి పోలీస్‌స్టేషన్‌కు షిఫ్ట్‌ల వారీగా వచ్చే సిబ్బందితో పాటు ఫిర్యాదుదారులు, వివిధ కేసుల నిమిత్తం నిందితులు, బస్తీలు, కాలనీల నుంచి వచ్చిపోతుంటారు. దీంతో పాటు బందోబస్తు, పెట్రోలింగ్, బస్తీలు, కాలనీల్లో చిన్న చిన్న గొడవలు, సంఘటనా స్థలాల సందర్శన, మృతదేహాల తరలింపు, దవాఖానలకు తరలించడం, కోర్టులకు వెళ్లడం ఇలా పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు.

ఇవి పాటించాలి..

–పోలీస్ స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించగానే చేతులు సబ్బుతో కడుక్కోవాలి. అందుకు ఆయా ఠాణాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

– స్టేషన్‌లోకి వచ్చే వారు తప్పని సరిగా మాస్కులు ధరించాలి. ఒక వేళ మాస్కు ధరించకుంటే పరిస్థితులను బట్టి పోలీసులు వారికి సమకూరుస్తారు.

–ఫిర్యాదు దారులు ఫిర్యాదు ఇచ్చేందుకు రిసెప్షన్ వద్దకు వెళ్తారు. అక్కడుండే సిబ్బందికి ఫిర్యాదుదారులకు మధ్య ఆరు అడుగుల దూరం తప్పని సరిగా ఉండాలి. ఇందుకు మధ్యలో చెట్ల కుండీలను ఏర్పాటు చేసుకోవాలి.

–ప్రతి పోలీస్ సిబ్బంది జేబులో 100 ఎంఎల్ శానిటైజర్ ఉండాలి. ఫీల్డ్ వర్క్‌కు వెళ్లేవారు తప్పనిసరిగా జేబులో ఉంచుకోవాలి.

– చేతికి గ్లౌస్‌లు తప్పని సరి. వివిధ కేసుల దర్యాప్తులో బయటకు వెళ్లే సిబ్బంది చేతులకు తప్పనిసరిగా ధరించాలి.సిబ్బంది రోజువారీగా తమ దుస్తులను డెటాల్ వంటి లిక్విడ్స్‌తో ఉతుక్కోవాలి.

పోలీసులది రెండో స్థానం: హైదరాబాద్ సీపీ అంజనీకుమార్

కరోనాతో జరుగుతున్న యుద్ధంలో వైద్యుల తరువాతి స్థానంలో పోలీసులు ఉండి పోరాడుతున్నారు. అలాంటి సమయంలో ప్రతి ఒక్క పోలీస్ స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో అన్ని రకాల ఏర్పాట్లు చేసి, నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చే వారు కూడా శుభ్రతతో వచ్చేందుకు వీలుగా చేతులు కడుక్కునే ఏర్పాట్లు ఆయా ఠాణాల ఆవరణలో ఉంటుంది.

# గొర్రెకుంట మిస్టరీని ఛేదించిన పోలీసులు

## జైంట్ కిల్లర్ సంజయ్ యాదవ్‌గా గుర్తింపు

## మహిళ హత్య బయటపడకుండా ఉండేందుకే వరుస హత్యలు?

వరంగల్,మే25(ఆర్ఎన్ఎ): వరంగల్ జిల్లా గొర్రెకుంటలో జరిగిన 9 మంది వలస కూలీల హత్య కేసులో కొత్త విషయాలు బయటకొస్తున్నాయి. ఒక హత్య కేసును కప్పిపుచ్చుకునేందుకు నిదితుడు మొత్తం 9హత్యలతో కుటుంబం యావత్తును సమాధి చేశాడు. దర్యాప్తులో నిందితుడికి సంబంధించి అనేక విషయాలు బయటపడుతున్నాయి. ఇంతకు ముందు చేసిన ఒక హత్య నుంచి తప్పించుకునేందుకు నిందితుడు 9 మందిని హత్య చేసినట్లు సమాచారం. మక్సూద్ సమీప బంధువుతో నిందితుడు సంజయ్ యాదవ్ సహజీవనం చేసినట్లు తెలుస్తోంది. అయితే సంజయ్.. ఆ మహిళను మార్చిలో పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు దగ్గర రైలు నుంచి తోసేసి హత్య చేసినట్లు పోలీసు విచారణలో బయటపడినట్లు సమాచారం. మక్సూద్ కుటుంబం ఆమె గురించి ఆరా తీయటంతోనే సంజయ్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితమే మక్సూద్ కుటుంబానికి చెందిన మహిళను కిల్లర్ సంజయ్ హత్య చేసినట్లు తెలుస్తోంది. మక్సూద్ బంధువును పెళ్లిపేరుతో మోసం చేసిన సంజయ్ నిడదవోలు దగ్గర రైల్లో నుంచి తోసేసినట్లు సమాచారం. కేసు బయటకు వస్తుందన్న భయంతో.. మక్సూద్ కుటుంబాన్ని సంజయ్ మట్టుబెట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వరంగల్ రూరల్ జిల్లా గొర్రెకుంట బావిలో పడి మరణించిన వారి కేసు మిస్టరీ దాదాపు కొలిక్కి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటనతో పోలీసులు రహస్యాన్ని ఛేదించేందుకు ప్రయత్నించి సక్సెస్ అయినట్టు సమాచారం. పలువురిని విచారించిన పోలీసులు నిందితుల నుంచి హత్యకుగల కారణాలను రాబట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. గురువారం మక్సూద్(50)తో పాటు అతడి భార్య నిషా, కుమార్తె బూస్రా(22) మూడేళ్ల మనవడు బావిలో శవాలుగా లభ్యం కాగా, శుక్రవారం మక్సూద్ కుమారులైన షాబాజ్ ఆలం(21), సోహెల్ ఆలం(18)తో పాటు బిహార్‌కు చెందిన వలసకార్మికులు శ్యాం(20), శ్రీరాం(21), త్రిపురకు చెందిన షకీల్ (30) మృతదేహాలు లభ్యమైన విషయం తెలిసిందే. నాలుగు రోజులు పోలీసులు, క్లూస్ టీంలు ఘటనా స్థలంతో పాటు, పరిసరాలను నిశితంగా పరిశీలించి ఆధారాలను సేకరించారు. పోస్టుమార్టం రిపోర్టులో ప్రాణం ఉండగానే బావిలో పడినట్టు తేల్చడంతో కేసు మరో మలుపు తిరిగింది. మృతుల్లో విష ఆహారం ఉన్నట్టు తేలడంతో ఇదిముమ్మాటికీ హత్యే అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పలువురు అనుమానితులను విచారించి ఎట్టకేలకే హత్యకుగల కారణాలను రాబట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

# వ్యవస్థలో మార్పుతో పటిష్ట పాలన

## ఏడాదిలోనే 90శాతం హామీల అమలు

## గ్రామసచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటికే పథకాలు

## ప్రతిలబ్దిదారుడికి మేలు కలిగేచాల చర్యలు

## మద్యనిషేధం అమలు దిశగా పటిష్టమైన చర్యలు

## మన పాలన– మీ సూచన' పేరుతో మేథోమథన సదస్సు

## క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ సమీక్ష

అమరావతి,మే25(ఆర్ఎన్ఎ): ఏడాది పాలనలో 90శాతం హామీలు నెరవేర్చడం ద్వారా ప్రజలకు సమర్థ పాలన అందించగలిగామని సిఎం వైఎస్ జగన్ అన్నారు. వ్యవస్థలో మార్పు తీసుకువస్తేనే తప్ప, ప్రజలను మనం ఆదుకోలేమనే భావన కలిగిందని, సుపరిపాలన అందించేందుకు ఒక వ్యవస్థను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆ వ్యవస్థే.. గ్రామ సచివాలయ వ్యవస్థ అని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందనిజగన్ ప్రశంసించారు. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామ వాలంటీర్లు, ఆశా వర్కర్ల వ్యవస్థ ద్వారా వైరస్ నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంగా అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలు.. ఆయా రంగాల్లో తీసుకువచ్చిన మార్పులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో 'మన పాలన– మీ సూచన' పేరుతో మేథోమథన సదస్సు సోమవారం ప్రారంభించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఎవరికీ అన్యాయం జరగకూడదనే సోషల్ ఆడిట్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. లబ్దిదారుల సోషల్ అడిట్ కోసం గ్రామ సెక్రటేరియట్స్‌లో పూర్తి ప్రదర్శనకు శ్రీకారం చుట్టామని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మొదటి ఏడాదిలో జరిగిన సంక్షేమం.. సంస్కరణలపై జగన్ సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లా కేంద్రాల నుంచి లబ్దిదారులు, నిపుణులు, ప్రముఖులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆరు రోజుల పాటు ఈ మేధోమథన సదస్సులు జరగనున్నాయి. తొలు పరిపాలన– సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి మాటను నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నామని.. మొదటి సంవత్సరంలోనే 90శాతం మేనిఫెస్టో హామీలను అమలు చేశామని అని జగన్ స్పష్టం చేశారు. 'ఎన్నికల ముందు 14 నెలల పాటు పాదయాత్ర చేశాను. పాదయాత్రలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలతో మమేకమయ్యాను. వివక్షలేని పాలన అందించాలని గట్టిగా నమ్మాను. మనసా, వాచా, కర్మణా నీతివంతంగా పాలన అందించడమే నా ధ్యేయం. ఏ లబ్దిదారుడికి అన్యాయం జరగకుండా గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించాం. చివరి లబ్దిదారుడి వరకు అందరికీ న్యాయం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చాం. ప్రజల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. గ్రామ సచివాలయాల ద్వారా లక్షా 35వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రతి 50 ఇళ్లకు ఒక గ్రామ వాలంటీర్‌ను నియమించాం. ప్రజలందరూ సంతృప్తి చెందే స్థాయిలో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాం. గతంలో లంచమిస్తే తప్ప పెన్షన్ రాని పరిస్థితి ఉండేది. ప్రతినెలా ఒకటో తారీఖు ఉదయాన్నే చిరునవ్వుతో పెన్షన్ అందిస్తున్నాం. గ్రామ వాలంటీర్లు, ఆశా వర్కర్ల కృషి వల్లే సమర్థంగా కోవిడ్‌ను ఎదుర్కోగలిగాం' అని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. 'మద్యం నియంత్రణ కోసం రేట్లను భారీగా పెంచాం. గతంలో వారానికి ఐదుసార్లు తాగేవాళ్లు ఇప్పుడు రెండుసార్లే తాగుతున్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు 24శాతం తగ్గాయి. ప్రతి గ్రామంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. 54 రకాల మందులు గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచబోతున్నాం. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించబోతున్నాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ జనతా బజార్లు ఏర్పాటు చేస్తున్నాం' అని జగన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. '14 నెలలపాటు నా పాదయాత్ర 3,648 కిలోమీటర్లు సాగింది. పాదయాత్రలో ప్రజల కష్టాలు గమనించా. ప్రభుత్వం ఏర్పడ్డాక సువరిపాలన అందించేందుకు ఒక వ్యవస్థను తీసుకొచ్చాం. ఆ వ్యవస్థే.. గ్రామ సచివాలయ వ్యవస్థ. ప్రతి లబ్దిదారుడికి న్యాయం జరిగేలా చూస్తున్నామని అన్నారు. లబ్దిదారుల జాబితాను గ్రామ సచివాలయంలో ఉంచుతున్నాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి నేరుగా ఇంటివద్దకే సేవలు అందేలా చేశాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీలకు వాలంటీర్ల వ్యవస్థలో 82 శాతం అవకాశం కల్పించామన్నారు. ఏడాది కాలంలో 4 లక్షల ఉద్యోగాలు కల్పించాం. అవినీతి లేని పారదర్శకత ఉన్న వ్యవస్థ.. గ్రామ సచివాలయ వ్యవస్థ. గ్రామ సచివాలయ వ్యవస్థ అద్భుతంగా పని చేస్తోంది. గ్రామ సచివాలయాలతో ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారు. అవ్వా తాతలకు నేరుగా ఇంటివద్దకే పెన్షన్ అందిస్తున్నాం. మత్స్యకార భరోసా, వాహనమిత్ర, వైఎస్ఆర్ భీమా పథకాలు తీసుకొచ్చాం. వాలంటీర్లు, ఆశావర్కర్ల వ్యవస్థ ద్వారానే కరోనాను నియంత్రణ చర్యలు చేపట్టాం. మూడుసార్లు కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించామని వివరించారు. ప్రభుత్వం తీసుకున్నచర్యల కారణంగా మద్యపానం తగ్గిందని, ప్రజలు నియంత్రణ పాటిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో 43 వేల బెల్టు షాపులను తొలగించామని, మద్యం అమ్మకాల్లో ప్రైవేట్ వ్యక్తులను కూడా తొలగించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. షాక్ కొట్టే విధంగా మద్యం ధరలు పెంచడంతో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయన్నారు. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నామని, ప్రతి గ్రామంలో ఇంగ్లీషు మీడియం తీసుకొచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభిస్తామన్నారు. 24 గంటలపాటు గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.




రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు ప్రారంభిస్తున్నామని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తామని సీఎం జగన్ పేర్కొన్నారు. రైతులు ఎలాంటి పంటలు వేసుకోవాలో వ్యవసాయ నిపుణుల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తామని వెల్లడించారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, త్వరలో గ్రామాల్లో జనతా బజారు తీసుకొస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. మన పాలన – మీ సూచన పేరుతో చేపట్టిన సదస్సులో శ్రీకాకుళం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన కృష్ణ దాస్, ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

విశాఖ నుంచిమంత్రి అవంతి శ్రీనివాస రావు, అరకు ఎంపి గొట్టేడి మాధవి, విశాఖ కలెక్టర్ వినయ్ చంద్, విఎంఆర్డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జివిఎంసి కమిషనర్ సృజన, విఎంఆర్డిఎ కమిషనర్ కోటేశ్వరరావు, జెసిలు వేణుగోపాలరెడ్డి, అరుణ్ బాబు, వైఎస్సార్సీపీ ఇంచార్జ్‌లు అక్కరమాని విజయనిర్మల, మల్లా విజయప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

# అమెరికాలో కరోనా తగ్గుముఖం

## అధ్యక్షుడు ట్రంప్ అంచనా

వాషింగ్టన్,మే25(ఆర్ఎన్ఎ): అమెరికాలో కరోనా ఉధృతి క్రమంగా తగ్గుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. కొత్తగా నమోదవుతున్న కేసుల సంఖ్య, మరణాల సంఖ్య భారీగా పడిపోయిందన్నారు. దేశంలో కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య లక్షకు చేరువవుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కరోనా కట్టడి చర్యల్ని పర్యవేక్షిస్తున్న 'వైట్ హౌజ్' అధికారి డెబోరా బిరెక్స్ ఇటీవల మాట్లాడుతూ.. కరోనాతో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య 50శాతానికి తగ్గిందని వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికాలో ఇప్పటి వరకు 16,77,356 కేసులు నమోదయాయి. వీరిలో 98,024 మంది మృత్యువాతపడగా.. 3,41,718 మంది కోలుకున్నారు. మరో 12,37,614 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కరోనా వైరస్ ముప్పు నుంచి తప్పించుకోవడానికి తాను తీసుకున్న హైడ్రాక్సీక్లోరోక్విన్ (హెచ్‌సీక్యూ)ను వాడడం ఆపేసినట్లు ట్రంప్ తెలిపారు. ఈ యాంటీ మలేరియా మందును రెండు వారాల పాటు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నానని.. హెచ్‌సీక్యూ వాడిన లక్ష్యం నెరవేరిందని చెప్పుకొచ్చారు. ఈ ఔషధం వల్ల దుష్ప్రభావాలు ఉంటాయని అనేక మంది హెచ్చరించి నప్పటికీ.. ట్రంప్ మాత్రం వెనకడుగు వేయలేదు. ఇప్పటికీ కరోనా చికిత్సలో హెచ్‌సీక్యూ వాడకాన్ని సమర్థిస్తున్నారు.

# నేను మంత్రిని.. హోటల్ క్వారెంటైన్ అవసరంలేదు



హైదరాబాద్: కేంద్ర మంత్రి సదానంద గౌడ ఇవాళ ఢిల్లీ నుంచి బెంగుళూరుకు విమానంలో వచ్చారు. అయితే ఆయన హోటల్ క్వారెంటైన్‌కు వెళ్లలేదు. క్వారెంటైన్ నిబంధనలు అందరికీ ఒక్కటే అని, కానీ కొంత మందికి మినహాయింపులు ఉన్నట్లు ఆయన తెలిపారు. నేను ఓ మంత్రిని, ఇన్‌స్టిట్యూషనల్ క్వారెంటైన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని, తన ఫోన్‌లో ఆరోగ్యసేతు యాప్ ఉన్నట్లు కూడా సదానంద గౌడ తెలిపారు. ఫార్మసీ శాఖకు తానే మంత్రిని అని, ఒకవేళ మందులను సరఫరా చేయకుంటే, కేసులు రెట్టింపు అవుతాయన్నారు. దేశమంతా మందులు సరఫరా జరిగేలా చూడాలన్నది తన బాధ్యత అని, ఒకవేళ డాక్టర్లు క్వారెంటైన్ అయితే, మందులు సరఫరా చేసేవాళ్లే క్వారెంటైన్ అయితే, అప్పుడు కరోనా వైరస్‌ను ఎవరు ఎదుర్కొంటారని మంత్రి అన్నారు. దేశీయ విమానాల్లో కర్నాటక వస్తున్నవారికి ఏడు రోజులు హోటల్ క్వారెంటైన్ తప్పనిసరి చేశారు. ఆ తర్వాత ఏడు రోజుల ఇంట్లో క్వారెంటైన్ కావాలి. మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఇది వర్తిస్తుంది. కానీ ఈ నియమం నుంచి కొందరికి మినహాయింపులు ఉన్నాయి.

# కవలల వైద్య ఖర్చులపై స్పందించిన కెటిఆర్

## లక్షరూపాయల మొత్తం అందించేలా చర్యలు: ఎమ్మెల్యే

జగిత్యాల,మే25(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం భూపతిపూర్ కు చెందిన భూపతి–ప్రశాంతి దంపతులకు ఇద్దరు కవలలు జన్మించారు.. అయితే పిల్లలిద్దరూ బరువు తక్కువగా ఉండటంతో..వైద్య ఖర్చుల కోసం లక్షల్లో ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు.

దీంతో భూపతి–ప్రశాంతి దంపతులు ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పారు. ఈ విషయమై మంత్రి కేటీఆర్ తో ఫోన్‌లో మాట్లాడిన సంజయ్ కుమార్ వైద్యఖర్చుల నిమిత్తం రెండు లక్షల ఎల్వోసిని వారికి అందజేశారు. చిన్నారులు వైద్యం పొందుతున్నజగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్‌కు, అండగా నిలిచిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కు భూపతి–ప్రశాంతి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ మహేశ్వర రావు, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ ఉన్నారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ రైతు

## –కెసిఆర్ ప్రణాళికకు రైతులంటా సిద్దం: బాజిరెడ్డి

నిజామాబాద్,మే25(ఆర్ఎన్ఎ): తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా నిలిచేలా చేసేందుకు సీఎం కేసీఆర్ చెప్పిన నియంత్రిత సాగు విధానాన్ని రైతులంతా స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..నియోజకవర్గంలో వానాకాలం సీజన్‌లో 40 శాతం సన్నరకం వరి సాగు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విత్తనాలు, ఎరువులపై అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన పంటలనే సాగు చేయాలన్నారు. మూస పద్ధతిలో వ్యవసాయం చేసి నష్టపోవద్దన్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి అత్యధిక లాభాలు పొందాలన్నారు.రాష్ట్రంలోని రైతాంగ అభివృద్ధి, సంక్షేమం కోసం ము ఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించేందుకు కృషి చేయడం చరిత్రాత్మకమని అన్నారు.

# అధికారులూ తస్మాత్ జాగ్రత్త

## –లేదంటే కోర్టుల చుట్టూ తిరగక తప్పదు: బండారు

విశాఖపట్నం,మే25(ఆర్ఎన్ఎ): ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పులు 63 రావడం ఎప్పుడూ చూడలేదని మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణ అన్నారు. అధికారులు జాగ్రతత్తగా ఉండాలని, లేదంటే గతంలో లాగా అధికారులు కోర్టుల చుట్టూ తిరగక తప్పదని హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను ఈ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. అయ్యా ఎస్‌లు అని మీరు అంటే తర్వాత కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తదని ఎద్దేవా చేశారు. జైలు అంటే జగన్, విజయసాయిరెడ్డికి భయంలేదని... కానీ నీలం సహానీ, గౌతం సవాంగ్‌లు మీరే ఆలోచించాలని హితవుపలికారు. మరకలు అంటించుకున్న గత ఐఏఎస్‌లు ఎలా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారో తమకు తెలీదా అని ప్రశ్నించారు.

జీఓలను సజ్జల రామకృష్ణారెడ్డి తయారు చేస్తున్నారని...నీలం సహానీ కళ్లుమూసుకుని సంతకాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులను బలిచేయద్దని... ఏపికి బదిలీపై రావడానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు భయపడుతున్నారని ఆయన అన్నారు.ం నాలుగు సీబీఐ ఎంక్వైరీలు ఏ ప్రభుత్వంలోనైనా వచ్చాయా అని ప్రశ్నించారు. సుధాకర్ కేసులో సీబీఐ వేశారని... పోలీసుల ప్రతిష్ట దిగజారినట్లు కాదా అని నిలదీశారు. 151 డైరెక్షన్ ప్రకారం విశాఖ పోలీసులపై చర్య తీసుకోమని కోర్టు చెపితే డీజీపీ ఏంచేశారన్నారు.హైకోర్టు తీర్పులపై తమకు గౌరవంలేదా అని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌ను, శాసనమండిలిని దిగజార్చారని...ఇప్పుడు కోర్టులను తూలనాడుతారా అంటూ వ్యాఖ్యానించారు. ఎల్జీ పాలిమర్స్‌పై జుడీషియల్ ఎంక్వైరీ వేయమని మొదట్లోనే చెప్పామని.. డీజీపీ వచ్చినపుడు కంపెనీ డైరెక్టర్లతో సన్నిహితంగా ఎందుకు తిరిగారని ప్రశ్నించారు. ఎల్జీ పాలిమర్స్ యాజమాన్యంపై ప్రభుత్వం ఎందుకు లైట్ తీసుకుందని బండారు సత్యనారాయణ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పరిశ్రమలుపెడితే ప్రోత్సహిస్తాం

## స్థానికులకే ఉపాధి కూడా దక్కుతుంది

## సారిశ్రామికవేత్తలకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ విజ్ఞప్తి

పాట్నా,మే25(ఆర్ఎన్ఎ): బిహార్ లో చాలా మార్కెట్ ఉందని, అక్కడ కొత్త యూనిట్లను ఏర్పాటు చేయాల్సిందిగా పారిశ్రామికవేత్తలను ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ కోరారు.

అందుకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. బిహార్‌కు లక్షలాది వలస కూలీలు తిరిగి రావడంపై నితీశ్ స్పందించారు. 'మాది వినియోగిత రాష్ట్రం. మాకు చాలా పెద్ద మార్కెట్ ఉంది. ఈ రాష్ట్రానికి చెందిన బిజినెస్ మెన్స్ దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి. వాళ్లు బిహార్ లో కొత్త ఇండస్ట్రీలు ఏర్పాటు చేయాలి. వారికి కావాల్సిన సాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఎవరైతే రాష్ట్రంలోనే వాణిజ్యం చేయాలనుకుంటున్నారో వారికీ సర్కార్ తోడుగా ఉంటుందన్నారు. ఇక్కడి ప్రజలకు ఇక్కడే ఉపాధి ఉద్యోగలు కల్పించాలనేది మా కోరిక. దీని వల్ల పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం ఉండదు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా అరేంజ్ మెంట్స్ చేస్తున్నాం. బిహార్ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం అవుతారు' అని నితీశ్ పేర్కొన్నారు. టెక్స్ టైల్స్, షూ, బ్యాగ్, ఫర్నీచర్, సైకిల్ ఇండస్ట్రీల్లో బిహార్ కు ఎక్కువగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బిహార్ కు వెలుపల ఉన్న ప్రైవేటు కంపెనీలు తమ రాష్ట్రానికి చెందిన వలస కూలీల బాగోగుల గురించి సరిగ్గా పట్టించుకోవడం లేదన్నారు. మైగ్రంట్ వర్కర్స్‌ను చూసు కోవాల్సిన బాధ్యత ఆ కంపెనీలదేనని నితీశ్ స్పష్టం చేశారు.

# అర్జున్ చవాన్ తల్లి మృతికి మంత్రి సత్యవతి సంతాపం




మహబూబాబాద్,మే 25 : కంపెల్లి బిల్యా నాయక్ తండాలో కెలోత్ అర్జున్ చవాన్ తల్లి మరణించడంతో ఆమె మృతికి రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం తెలిపి..నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. అనంతరం సంకీస గ్రామానికి చెందిన బాణోత్ శ్రీను, డీఆర్ డీఏలో సైంటిస్ట్ గా పని చేస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో మంత్రి సత్యవతి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యాన్ని చెప్పారు. శ్రీను ఆత్మకి శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ సందర్భంగా తండావాసులు రైతులకు రైతుబంధు ఇవ్వడంలో, చెరువుకు నీరు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

# బావిలో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య



కామారెడ్డి, మే 25: కామారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. లింగంపేట్ తాడ్వాయి మండలం ఎర్రాపాడ్ గ్రామంలో తల్లీకూతుళ్లిద్దరూ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఈతగాళ్ల సాయంతో తల్లీకూతుళ్ల మృతదేహాలను బావిలో నుంచి బయటకు తీశారు. మృతులను బద్దం లింగమని (40), బద్దం శిరీష (18) గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వ్యవసాయంలో సంస్కరణల శకం

### ఈ యేడాది నుంచే అమలు
### వ్యవసాయరంగం ప్రగతికి కెసిఆర్ కంకణం: మంత్రి పువ్వాడ

ఖమ్మం, మే 25(ఆర్ఎన్ఎ): వ్యవసాయంలో సంస్కరణల శకం ఈ ఏడాది వర్షాకాలంలో ప్రారంభమవుతుందని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. వ్యవసాయ రంగం మరింత ప్రగతి సాధించేందుకు ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని ఇప్పుడిప్పుడే రైతాంగంలో నమ్మకం ఏర్పడుతోందని అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రైతులతో సమావేశమైన మంత్రి అజయ్‌కుమార్ సమగ్ర పంటల విధానం పై అవగాహన కల్పిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కష్టించి పండించిన పటకు మంచి రేటు రావాలని, ఉత్పత్తి అంతా సంపూర్ణంగా అమ్ముడుపోయేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

రైతులు పండించిన పంటను నేరుగా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలుచేసేలా వారికి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణలో పంటల సాగు జరగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్షిస్తు న్నారని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ రూపు రేఖలు మార్చే విధంగా ప్రజల అవసరాలు, మార్కెట్ డిమాండ్‌లకు అనుగుణంగా జరగాల్సిన పంటల సాగుపై అనుసరించాల్సిన విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు మంచి ఆదాయం రావాలంటే ప్రభుత్వం సూచించిన పంటలనే సాగుచేయాలని అన్నారు. ప్రభుత్వం ఏం చేసినా రైతుల కోసమే చేస్తుందన్నారు రైతులు ప్రభుత్వం పస నమ్మకం ఉంచి ప్రభుత్వం సూచించిన పంటల సాగు చేస్తే బాగుంటుందని అన్నారు.

# పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా రంజాన్ వేడుకలు




కరీంనగర్, మే 25:రంజాన్ పర్వదినం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కమీషనరేట్ వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం అమలచేస్తున్న నియమనిబంధనల్లో భాగంగా మసీదులు, స్మశానవాటికలు, ఈద్గాల వద్ద ఎవరినీ అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. పైన పేర్కొన్న ప్రాంతాలతో పాటు మటన్,చికెన్,చేపలు, ఇతర మాంసాహార మార్కెట్ల వద్ద రద్దీని నియంత్రించడంతోపాటు సామాజికదూరం పాటించేలా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ అడిషనల్ కమిషనర్ (పరిపాలన)జి చంద్రమోహన్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పర్వదినం వేడుకలు పటిష్ట పోలీసుబందోబస్తుమధ్య ప్రశాంతంగా కొనసాగాయన్నారు. ఇళ్ళలోనే ప్రార్ధనలు నిర్వహించారు. ఉదయం 11గంటల తర్వాత పెట్రోలింగ్‌ను కొనసాగించారు. ఈ బందోబస్తుకోసం వివిధ విభాగాలు, స్థాయిలకు చెందిన 250మంది అధికారుల సేవలను వినియోగించామని పేర్కొన్నారు. అమల్లోఉన్న నియమనిబంధనలు పాటించి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తమవంతు సహకారాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసిపి పి అశోక్, కరీంనగర్‌రూరల్, హుజురాబాద్ ఏసిపిలు విజయసారధి, సుందరగిరి శ్రీనివాసరావులతోపాటు వివిధ విభాగాలు, వివిధస్థాయిలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**రాత్రివేళల్లో కర్ఫ్యూ పటిష్టంగా అమలుచేస్తాం**

**పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి**

ప్రస్తుత అమల్లో ఉన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు రాత్రివేళల్లో కర్ఫ్యూను మరింతపటిష్టంగా అమలుచేస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. కర్ఫ్యూ నిబంధనలు ఉల్లఘించేవారిపై చట్టపరంగా కేసులను నమోదుచేస్తామని హెచ్చరించారు. ప్రజల రక్షణ,భద్రతల దృష్ట్యా పోలీస్‌శాఖ కఠినంగా కర్ఫ్యూ అమలులో వ్యవహరించాల్సి వస్తోందని, అన్నివర్గాల ప్రజలు పరిస్థితులను అవగతం చేసుకుని స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లఘించి రోడ్లపైకి కర్ఫ్యూ వేళల్లో అకారణంగా వచ్చేవారికి సంబంధించిన వాహనాలను సీజ్‌చేయడం తోపాటు లాక్‌డౌన్ పూర్తయిన తర్వాత న్యాయస్థానాలలో సదరు వాహనాలను డిపాజిట్ చేస్తామని స్పష్టం చేశారు. కర్ఫ్యూ వేళల్లో నియమనిబంధనలు ఉల్లఘించేవారిపై చట్టపరంగా కేసులను నమోదుచేయడం ద్వారా వారికి భవిష్యత్‌లో ఉన్నతవిద్య, ఉద్యోగ,ఉపాధి అకాశాలు లభించకపోవ డంతోపాటు పాస్‌పోర్టుల రద్దుకు ప్రతిపాదనలు పంపనున్నామని తెలిపారు.

# అన్ని విమానాల్లో మధ్య సీటు ఖాళీగా ఉంచాల్సిందే

### అంతర్జాతీయ ప్రయాణికుల తరలింపుపై సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ): విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించేందుకు ఉద్దేశించిన స్పెషల్ విమానాల్లో మధ్య సీటును ఖాళీగా ఉంచాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. భౌతిక దూరం అన్నది చాలా ముఖ్యమని పేర్కొంది. బయట ఒక్కో వ్యక్తికి మధ్య ఆరు అడుగుల దూరాన్ని పాటిస్తున్నప్పుడు విమానాల్లో మధ్య సీటునుఖాళీగా ఉంచకపోవడమేంటని ప్రశ్నించింది. అయితే నిపుణుల సలహా పైనే విమానాల్లో మధ్య సీటును ఖాళీగా ఉంచడంలేదని కేంద్రం తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. సరైన విధానమేమిటంటే టెస్టింగ్, క్వారంటైన్ అన్నవే అని ఆయన పేర్కొన్నారు. కానీ దీనితో విభేదించిన కోర్టు.. విమాన ప్రయాణికులకు ఈ వైరస్ సోకదని ఎలా భావిస్తారని కూడా ప్రశ్నించింది. జూన్ 16 వరకు బుకింగ్స్ జరిగాయని తుషార్ మెహతా పేర్కొనగా.. ఇకపై అన్ని ప్రత్యేక విమానాల్లో మధ్య సీటును ఖాళీగా ఉంచాలని కోర్టు ఆదేశించింది.

# ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు...





వేములవాడ, మే 25 (నేటినిజం ప్రతినిధి): ముస్లిం సోదరుల పవిత్ర మాసమైన రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముగించుకొని సోమవారం ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ వేడుకలను తమ ఇళ్లలోనే ఘనంగా నిర్వహించుకున్నారు.

కరోనా మహమ్మారి కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నియమ నిబంధనల ప్రకారం ముస్లిం సోదరులు అంతా తమ ఇళ్లలోనే ఈద్ నమాజ్ ను భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకున్నారు .తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,సీనియర్ జర్నలిస్టు ఎంఎం మన్నాన్,తాహెర్ పాషా ,హబీబ్ , రసూల్ ,కలీం ,అలీ ,ఖాజా నయిమొద్దీన్ , ఇ సూ బ్,నవాబ్ ఖాన్ , టీఆర్ఎస్ నాయకులు పీర్ మహమ్మద్ ,సర్వర్ పాషా ,అంజాద్ పాషా,గౌస్ బాబా ,మాజీ కోప్షన్ మెంబర్ దూలే భాషా ముస్లిం నాయకులు రియాజ్ ,అక్రమ్ ,అతిక్ ,షాహిద్ , తన కుటుంబ సభ్యులతో ఇంట్లోనే ఈద్ నమాజ్ పూర్తి చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. స్టే ఎట్ హోమ్...ప్రే ఎట్ హోమ్ అనే నినాదాన్ని ముస్లీమ్ సోదరులంతా పాటించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లాయక్ పాషా ,మన్నాన్ మాట్లాడుతూ దురదృష్టకరమైన రోజులను గడుపుతున్నామనీ.. ముస్లిం సోదరులు ఈద్గా లకు, మసీదులకు వెళ్లకుండా, హిందూ సోదరులు దేవాలయాల దర్శనాలకు దూరమవ్వడం, క్రిస్టియన్ సోదరులు చర్చలకు వెళ్లక పోవడం బాధాకరమన్నారు.కొరోనా మహమ్మారి ని తరిమికొట్టే యుద్ధంలో కులమతాలకతీతంగా, ప్రాంతాలకతీతంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత దూరాన్ని పాటిస్తూ ..మాస్కు తప్పనిసరిగా ధరించాలని,సానీటైజర్ ను తప్పకుండా వినియోగించాలని సూచించారు.దేశ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.. ఈదుల్ ఫితర్ పండగ కోసం ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన డీఎస్పీ చంద్రకాంత్,సిఐ వెంకటేశ్ కమిషనర్ మట్టా శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చెర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు,వైస్ చైర్మన్ మధు రాజేందర్ పాలక మండలి సభ్యులకు,ప్రభుత్వ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిబిఎస్ఇ పరీక్షల కోసం 15వేల కేంద్రాలు

న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌లో వాయిదాపడిన 10, 12వ తరగతి పరీక్షలను 15,000 సెంటర్లలో నిర్వహించనున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ తెలిపారు. లాక్‌డౌన్ కారణంగా పెండింగ్ పడిన పరీక్షలను జూలై 1 నుంచి 15 వరకు నిర్వహించాలని సీబీఎస్ఈ ఇటీవల నిర్ణయించింది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను కూడా వెల్లడించింది.

అయితే, సీబీఎస్ఈ పరీక్షలన్నీ విద్యార్థులు చదువుతున్న స్కూళ్లలోనే జరుగుతాయని, ఇతర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు వేయరని మంత్రి రమేశ్ పోఖ్రియాల్ పేర్కొన్నారు. ఆ లెక్క ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 3,000 సెంటర్లలో పరీక్షలు జరుగాల్సి ఉంది. కానీ, కరోనా విస్తరణ నేపథ్యంలో మూడు వేల సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తే సామాజిక దూరం పాటించడం కష్టమని భావించి తాజా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణ కోసం 15 వేల పరీక్ష కేంద్రాలను సిద్ధం చేస్తున్నది.

# ఢిల్లీలో 635 కొత్త కరోనా కేసులు

న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో గత 24 గంటల్లో 635 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 14,053కు చేరింది. కరోనా బారినపడిన వారిలో 7006 మంది చికిత్స పొందుతుండగా, 6771 మంది బాధితులు కోలుకున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 276 మంది కరోనా వైరస్ ప్రభావంతో మరణించారు. గత 24 గంటల్లో 231 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. దేశంలో మొత్తం 1,38,845 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, 4021 మంది మరణించారు.

# చిన్నారులకు మంత్రి కేటీఆర్ భరోసా..రూ.2లక్షల ఎల్ వోసీ అందజేత




జగిత్యాల,మే 25: జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం భూపతిపూర్ కు చెందిన భూపతి-ప్రశాంతి దంపతులకు ఇద్దరు కవలలు జన్మించారు..అయితే పిల్లలిద్దరూ బరువు తక్కువగా ఉండటంతో..వైద్య ఖర్చుల కోసం లక్షల్లో ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో భూపతి-ప్రశాంతి దంపతులు ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పారు.

ఈ విషయమై మంత్రి కేటీఆర్ తో ఫోన్ లో మాట్లాడిన సంజయ్ కుమార్ వైద్యఖర్చుల నిమిత్తం రెండు లక్షల ఎల్వోసిని వారికి అందజేశారు. చిన్నారులు వైద్యం పొందుతున్నజగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ తో మాట్లాడిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్య సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ కు, అండగా నిలిచిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కు భూపతి-ప్రశాంతి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ మహేశ్వర రావు, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ ఉన్నారు.

# సిఎం రిలీఫ్‌ఫండ్‌కు అందిన విరాళాలు ఎంత

### వాటన్నింటిని ఎలా ఖర్చు చేశారు
### కేంద్రం ఇచ్చిన నిధులు ఏం చేశారు
### వీటిపై శ్వేతపత్రం విడుదల చేయండి
### సిఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ లేఖ

హైదరాబాద్,మే25(ఆర్ఎన్ఎ): సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందిన మొత్తాన్ని, వాటిని ఎలా ఖర్చుచేశారో వివరాలు తెలపాని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. సిఎం కెసిఆర్‌కు, కొడుకు కేటిఆర్‌కు అందిన విరాళాలు మొత్తం ఎంత? మీరు వాటిని ఎలా ఖర్చు పెట్టారు? ఆ వివరాలను ప్రజలకు స్పష్టంగా చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. వలస కార్మికుల తరలింపు కోసం, మీరు ఖర్చు పెట్టారని చెపుతున్న డబ్బులు, కేంద్రం ఇచ్చిన విపత్తు నిధి నుంచా? లేదా వేరే నిధుల నుండి ఇవి వచ్చాయా? అని ప్రశ్నించారు. ఈమేరకు ఆయన సిఎం కెసిఆర్‌కు ఓ బహిరంగ లేఖ రాశారు. కోవిడ్ వ్యాధిని ఎదుర్కొవటానికి తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం ఇచ్చిన నిధులను మీరు ఎలా ఖర్చు పెట్టారో వివరిస్తూ శ్వేత పత్రం విడుదల చెయ్యాలని, భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని సంజయ్ అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మనిర్భర్ ప్యాకేజీపై సీఎం కేసీఆర్ లేని పోని విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. దేశ, రాష్ట్రాల బాగు కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్యాకేజీని ప్రకటిస్తే.. తమ అసమర్ధ పాలనను కప్పిపుచ్చుకోవటానికి, కేంద్ర ప్రభుత్వంపై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. మాటల గారడీతో రాష్ట్ర ప్రజలను ఇంకెన్ని రోజులు మోసం చేస్తారని ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంజయ్ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్దీపనలు ఫ్యూడల్ విధానంలో ఉన్నాయని సీఎం అనటం, భూస్వామ్య విధానం, ఫ్యూడల్ స్వభావం గురించి మాట్లాడటం మరీ విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రాల చేతుల్లోకి నగదు రావాలని చెబుతున్న కేసీఆర్.. కేంద్రం నేరుగా నగదు ఇస్తే మీ జేబులు నింపుకుందామనా? అభివృద్ధి పనుల పేరుతో కమిషన్లు దండుకుందామనా? అని అడిగారు. ఇప్పుడిక అలాంటివి సాధ్యం కాదని అన్నారు. ఎఫ్.ఆర్.బీ.ఎం పరిమితి సంస్కరణల పై అసంబద్ధమైన ఆరోపణలు చేశారని, సంస్కరణలు తేవటం, ప్రభుత్వపాలనలో ఒక భాగమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు క్రమం తప్పకుండా అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్నదని, రైతుబంధు ద్వారా రైతులకు అలా అందడం లేదని బండి సంజయ్ అన్నారు. రైతు బంధు ఆర్థిక సహాయాన్ని, పంటల నియంత్రిత పద్ధతితో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమో స్పష్టం చెయ్యాలని సీఎంను డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తారా లేదా? అని చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రానికి కోవిడ్ నిధులను ఇవ్వలేదా?అని లేఖలో సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన రూ. 224 కోట్లు, మెడికల్ పరికరాల కోసం ఇచ్చిన రూ.216 కోట్లు, డివల్యూషన్ నిధులలో తొలి విడతగా ఇచ్చిన రూ.982 కోట్లు, ఎలా ఖర్చు చేశారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. ఇచ్చిన నిధులను, ఎలా ఖర్చు పెట్టారో చెప్పకుండా, రాష్ట్ర ప్రజలకు ఏవేవో మాయమాటలు చెబుతున్నారన్నారు. పీఎం కేర్స్ నిధుల నుంచి ప్రధాని, 3100 కోట్ల రూపాయలను వెంటిలేటర్ల తయారీకి, వలస కార్మికుల కోసం, వాక్సిన్ అభివృద్ధికి కేటాయించారని వాటిని ఎలా ఖర్చుచేశారో చెప్పాలన్నారు.

# మోటర్ దొంగతనంతో అవమానం

### భార్యాపిల్లలకు విషమిచ్చి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు,మే25(ఆర్ఎన్ఎ): గుంటూరు జిల్లాలో దారుణం జరిగింది. అవమానభారతంతో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. బాపట్ల మండలం మరుప్రోలవారిపాలెంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతులు వీరారెడ్డి (40), భార్య రమణమ్మ (38), కుమార్తె పోలేరమ్మ (13)గా గుర్తించారు. దొంగతనం నెపం మోపారని అవమానభారంతో వీరు ఆత్మహత్య చేసుకున్నారు. పొలంలో మోటర్ దొంగతనం చేశాడని గత వారం రోజులుగా వీరారెడ్డి పోలీసు విచారణ ఎదుర్కొంటున్నాడు. పోలీసులు పిలిచి విచారణ చేయడంతో అవమానంగా భావించిన వీరారెడ్డి భార్యా పిల్లలకు విషమిచ్చి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# పదేండ్ల బాలికపై అత్యాచారం.. 60 ఏండ్ల వృద్ధుడు అరెస్ట్

విశాఖపట్నం,మే25: విశాఖపట్నం జిల్లాలో పదేండ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ ఎరుకు నాయుడు అనే 60 ఏండ్ల వృద్ధుడిని అనకాపల్లి దిశా పోలీస్‌స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మే నెల 23న విశాఖపట్నం జిల్లా కసింకోట మండలం, నరసపురం గ్రామంలో ఎరుకు నాయుడు అనే వృద్ధుడు తమ పొరుగునే ఉండే పదేండ్ల బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న ఆమె తల్లి అదే రోజు రాత్రి (మే 23) అనకాపల్లిలోని దిశా పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించిన అనకాపల్లి దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కుమారస్వామి.. తదుపరి విచారణ కొనసాగుతుందని చెప్పారు.

# అయిన వారికి ప్రైవేట్ యూనివర్సిటీలా?

### ఉన్నత విద్యను అంగడి సరుకు చేస్తారా
### ప్రభుత్వ వర్సిటీల్లో పోస్టులను ఎందుకు భర్తీ చేయరు
### -మండిపడ్డ సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్,మే25(ఆర్ఎన్ఎ): ప్రజలంతా కరోనా ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్ మాత్రం సందట్లో సడెమియాలా వ్యవహరిస్తున్నారన్నారు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతిస్తూ వాటిని సొంతవారికి కట్టబెట్టారని మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. స్వార్థంతోనే సీఎం కేసీఆర్ ఐదు ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చారన్నారు. అవన్నీ అతనికి ఆర్థిక వనరులు సమకూర్చే వారికే ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు స్టాఫ్‌ని, నిధులని కేటాయించకుండా నిర్వీర్యం చేస్తున్నారని.. ఉన్నత విద్యను బజారులో పెట్టి అమ్ముతున్నారని మండిపడ్డారు. మంత్రి మాల్లారెడ్డికి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి యూనివర్సిటీలు పెట్టుకునే అధికారం ఇవ్వడం

అధికార దుర్వినియోగమే అని భట్టి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి జిల్లాకు యూనివర్సిటీ కేటాయించి.. ఉన్నత విద్యను ప్రోత్సహించామని కెసిఆర్ చెప్పారన్న విషయం గుర్తు చేశారు. పేద విద్యార్థులు చదువుకోవడం కేసీఆర్‌కు ఇష్టం లేదన్న భట్టి.. ప్రైవేట్ యూనివర్సిటీల వల్ల ఎస్సి, ఎస్టీ విద్యార్థులు నష్టపోతారన్నారు. ఉన్న యూనివర్సిటీలను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉద్యోగావకాశాలు కల్పించే కోర్సులను ప్రవేశ పెట్టాలన్నారు. ఎస్సి,ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతుందని.. బాంచెన్ దొర సంస్కృతికి తెరలేపడానికే కేసీఆర్ ప్రైవేట్ యూనివర్సిటీలను తెస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు.

# ఎపిలో ఆగని కరోనా కేసులు

### తాజాగా 89 కేసులు నమోదు
### ఉభయగోదావరి జిల్లాల్లో కరోనా కలకలం
### దుబాయ్ నుంచి వచ్చిన వారిలో పాజిటివ్ లక్షణాలుల

అమరావతి,మే25(ఆర్ఎన్ఎ): ఏపీలో కరోనా పంజా విసురుతోంది. తాజాగా 89 వైరస్ కేసులు నమోదయ్యాయి. మొత్తం కరోనా బారిన పడిన వారి సంఖ్య 2,886 కు చేరుకుంది. గడిచిన 24 గంటల్లో వైరస్ కారణంగా ఎటువంటి మరణం సంభవించలేదని, ఇప్పటివరకు రాష్ట్రంలో 56 కరోనా మరణాలు నమోదయ్యాయని అక్కడి హెల్త్ మినిస్ట్రీ సోమవారం విడుదల చేసిన బులెటిన్ లో వెల్లడించింది. కొత్త కేసుల్లో ఏడుగురు చెన్నైలోని కోయంబేడు మార్కెట్‌తో సంబంధం ఉన్నవారు కాగా.. 41 మంది ఫారిన్ నుంచి వచ్చిన వారేనని తెలిపింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 10,240 మంది శాంపిల్స్ టెస్ట్ చేశామని, వివిధ ఆస్పత్రుల నుంచి 41 మంది డిశ్చార్జ్ అయ్యారని చెప్పింది. ఇప్పటివరకు రాష్ట్రంలో వైరస్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 1,848 కు చేరుకున్నట్లు ప్రకటించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో కొత్తగా 7 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పెదపాడు మండలం తోటగూడెంలో మూడు, పోలవరంలో ఒక కేసు ఆకివీడు మండలం గుమ్ములూరు, ఏలూరు కుండీ సెంటర్ వద్ద ఒక్కో కేసు నమోదు అయ్యింది. కొత్తగా కేసులు నమోదు అయిన ఏలూరు కుండీ సెంటర్, గుమ్ములూరు, పైడిపర్రు, పోలవరంలలో కంటైన్ మెంట్ జోన్లను అధికారులు ఏర్పాటు చేశారు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్ర పురంలో కొత్తగా 9 పాజిటివ్ కేసులు, పాతవి 6 మొత్తం 15 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో కొత్తగా 9 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో మన్యంలో తొలి కరోనా కేసు నమోదయ్యింది. రంపచోడవరం మండలం చెరువూరులో బాలుడికి కరోనా పాజిటివ్ అని తేలింది. బిక్కవోలు, మామిడాడ గ్రామాల్లో ఇప్పటివరకు 37 పాజిటివ్ కేసులు నమోదవ్వగా.. ఒకరు మృతి చెందారు. ఇకపోతే దుబాయ్ నుంచి కృష్ణా జిల్లాకు వచ్చిన వారిలో కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కృష్ణా జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్వారంటైన్‌లో.. దుబాయ్ నుంచి వచ్చిన 144 మందిని ఉంచారు. వారికి పరీక్షలు నిర్వహించగా 56 మందికి ట్రూనాట్ కిట్‌లో పాజిటివ్ అని తేలింది. దీంతో ఆ 56 మందిని అధికారులు విజయవాడకు తరలించారు.

# ఆత్మహత్య చేసుకొన్నాడు.. కానీ, కరోనా కాదని తేలింది

బెంగళూరు,మే25: కరోనా వైరస్ సోకడంతో తానిక బతకలేనని భావించిన ఒక పెద్దాయన క్వారంటైన్ కేంద్రంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీరా ఆయన నివేదిక నెగెటివ్ అని రావడంతో బిత్తరపోవడం మృతుడి కుటుంబీకుల వంతైంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక చిక్‌మగ్‌ళూరులోని కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ భవనంలో ఏర్పాటుచేసిన క్వారంటైన్ కేంద్రానికి 53 ఏండ్ల పెద్దాయన వచ్చాడు. జ్వరం, గొంతునొప్పి, దగ్గు వంటి ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు కనిపించడంతో కరోనా వైరస్ సోకినట్లు భావించాడు. ఆయన గొంతు నుంచి ద్రవాలను సేకరించిన అధికారులు.. వాటిని పరీక్షల నిమిత్తం కొప్పా దవాఖానకు పంపారు. అనంతరం ఆయనను క్వారంటైన్ కేంద్రంలోనే ఉంచారు.

హెమరాయిడ్ వ్యాధితో కూడా బాధపడుతున్న ఆయన గత నెల 20 న చికిత్స చేయించుకొన్నాడు. శనివారం కరోనా నెగెటివ్‌గా ఫలితం రావడంతో అదేరోజు రాత్రి ఆయనకు సమాచారమిచ్చారు. అయితే, ఆదివారం ఉదయం వైద్యులు వచ్చి చూసేసరికల్లా ఆయన కనిపించలేదు. సమీపంలోని బాత్రూంలో ఆత్మహత్య చేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించి అంత్యక్రియలు నిర్వహించారు. కరోనా భయంతో ఆత్మహత్య చేసుకోవడం ఇది మూడో ఘటన కావడం విశేషం.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com